సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



ఆర్టీసీకి అదనపు రాబడి

కార్గో ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని ఇస్తోంది. జిల్లాలో ఈ వ్యాపారం చక్కగా సాగుతోంది.

- 8లో

శ్రీకాకుళం ఆర్‌డీవో రంగయ్య బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: శ్రీకాకుళం ఆర్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌ రంగయ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఆర్‌డీవోగా కె.సాయిప్రత్యూషను నియమించారు. అలాగే టెక్కలి ఆర్‌డీవోగా ఎం.కృష్ణమూర్తిని నియమిస్తూ ఉత్వర్వులు జారీ కాగా, రంగయ్యకు ఇంకా ఎక్కడా పోస్టింగ్‌ ఇవ్వలేదని తెలుస్తోంది.



డిస్కస్‌త్రోలో ఓ అథ్లెట్‌ విన్యాసం

న్యూస్‌రీల్‌

28న ఆలయాల్లో పూజలు

- చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేద్దాం
- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌

నరసన్నపేట: చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేసేందుకు పార్టీ శ్రేణులు ఈ నెల 28న ఆలయాల్లో పూజలు చేయాలని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌, పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి తమ్మినేని సీతారాంలు విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఉదయమే ఆలయాలకు వెళ్లి పూజలు చేయాలని తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుమల పవిత్రతను, లడ్డూ ప్రసాదం విశిష్టతను ముఖ్యమంత్రి చంద్రబాబు అపవిత్రం చేసే విధంగా మాట్లాడటాన్ని, ప్రవర్తించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన పాపాలు ప్రక్షాళన అయ్యే విధంగా పూజలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వాడకుండా తిరిగి పంపేసిన నెయ్యిని పట్టుకొని చంద్రబాబు డ్రామాలు ఆడారని, తప్పుడు ప్రకటనలు చేశారని మండి పడ్డారు.

మైన్స్‌ శాఖ డీడీగా మోహనరావు



అరసవల్లి: జిల్లా భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌(డీడీ)గా సి.మోహనరావును నియమిస్తూ గనుల శాఖ కమిషనర్‌ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విజయవాడ మైన్స్‌ కమిషనరేట్‌లో పనిచేస్తూ తాజా బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చా రు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

స్కూల్‌ విద్యార్థి మృతిపై తక్షణ నివేదిక అందించండి

శ్రీకాకుళం అర్బన్‌: రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థి వనం కృష్ణంరాజు స్కూల్‌ పైభాగాన గల స్లైడ్‌ కూలి మృతి చెందిన దుర్ఘటనపై తక్షణ నివేదిక అందించాలని శ్రీకాకుళం కలెక్టర్‌, విద్యాశాఖ అధికారులకు సూచనలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఈ సంఘటనపై తమ కమిషన్‌ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని అన్నారు. ఈ మండలంతో పాటు జిల్లాలో ఇలాంటి భద్రతా గోడలు లేని పాఠశాలలు ఎన్ని ఉన్నాయో సంబంధిత వివరాలు జిల్లా అధికారులు యుద్ధ ప్రాతిపదికన అందిస్తే శ్రీకాకుళం జిల్లా అధికార యంత్రాంగానికి వివిధ సిఫారసులు, సూచనలు జారీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆంధ్రా రంజీ జట్టుకు విజయ్‌ ఎంపిక



త్రిపురాన విజయ్‌

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్‌ క్రికెటర్‌ త్రిపురాన విజయ్‌ మరోసారి ప్రతిష్టాత్మక రంజీ టోర్నీకి ఎంపికయ్యాడు. ఈ ప్రతిష్టాత్మక మెగా టోర్నీలో పాల్గొనే 16 మంది సభ్యులతో కూడిన ఆంధ్రా తుది జట్టులో ఈ యువ క్రికెటర్‌ చోటు దక్కించుకున్నాడు. రెండేళ్ల కిందట కూడా విజయ్‌ రంజీ ఆడాడు. విజయ్‌ ఎంపికపై జిల్లా క్రికెట్‌ సంఘ అధ్యక్షుడు పుల్లెల శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్‌ ఇలియాస్‌ మహ్మద్‌, కోశాధికారి మదీనా శైలానీ, రవి కుమార్‌, కోచ్‌లు, సీనియర్‌ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. రంజీ క్రికెట్‌ టోర్నీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఐపీఎల్‌ టోర్నీకి ఎంపిక కావడమే లక్ష్యంగా ప్రయత్నా లు చేస్తున్నానని విజయ్‌ తెలిపాడు. తన జీవిత లక్ష్యం జాతీయ జట్టుకు ఆడడమేనని చెప్పాడు.

గుణుపూర్‌-విశాఖ రైలులో సూట్‌కేస్‌ కలకలం

ఆమదాలవలస: గుణుపూర్‌ నుంచి విశాఖపట్టణం వెళ్లే రైలులో గురువారం ఒక సూట్‌కేస్‌ కలకలం రేపింది. ఒడిశా రాష్ట్రం పర్లాఖిముండిలో సూట్‌కేస్‌తో ఎక్కిన గుర్తు తెలియని వ్యక్తి తన సూట్‌కేసును ఒక చోట పెట్టి మరో చోట కూర్చున్నారు. తోటి ప్రయాణికులు ఆయనను అలా ఎందుకు చేశావని గట్టిగా ప్రశ్నించారు. అయితే ఆ సూట్‌కేసు తనది కాదని, తాను విశాఖపట్నం వెళ్తున్నానని పక్క ప్రయాణికులతో చెప్పి పాతపట్నం స్టేషన్‌లో రైలు దిగి వెళ్లిపోయాడు. దీంతో ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. నౌపడ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు సూట్‌కేసును స్వాధీనం చేసుకున్నారు. దాన్ని శ్రీకాకుళం రోడ్‌ రైల్వేస్టేషన్‌ ఆర్‌పీఎఫ్‌ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఆ సూట్‌కేస్‌లో ఏముంది అన్న విషయం ఇంకా తెలియాల్సి ఉంది.



లాంగ్‌జంప్‌లో ఓ క్రీడాకారిణి ప్రతిభ





స్కూల్‌గేమ్స్‌ పోరు.. క్రీడాకారుల జోరు

జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్‌ ఎంపికలు పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగుతున్నాయి. మలివిడత షెడ్యూల్‌లో భాగంగా గురువారం అథ్లెటిక్స్‌, క్రికెట్‌ క్రీడాంశాల్లో ఎంపికలు సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్‌ ఎంపికలు జరగగా, అదే కళాశాల మైదానంలో ఉన్న క్రికెట్‌ నెట్స్‌లో క్రికెట్‌ ఎంపికలను నిర్వహించారు. అండర్‌-14, అండర్‌-17, అండర్‌-19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా ఎంపికలను చేపట్టారు. అథ్లెటిక్స్‌లో రన్స్‌, జంప్స్‌, త్రోస్‌లో ఈవెంట్స్‌ జరిపారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాలను త్వరలో వెల్లడించనున్నట్టు ఎస్‌జీఎఫ్‌ నిర్వాహకులు పేర్కొన్నారు. - శ్రీకాకుళం న్యూకాలనీ

అమ్మ లోకేశా.. బొంకుడు నేర్చావా!





తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బొంతు, కామేశ్వరి పేట ఎత్తిపోతల పథకాలు, వంశధార ప్రాజెక్టు పెండింగ్‌ ఉన్న వనితమండలం వంతెన, ఆమదాలవలస-పొలాకి వంతెనలు పనులు పూర్తి చేస్తాం. నాగావళి- వంశధార నదిపై పురుషోత్తపురం వంతెనలు నిర్మిస్తాం. ఆమదాలవలసలో ప్రభుత్వం ఇంజనీరింగ్‌ కళాశాల ఏర్పాటు చేస్తాం. పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తాం. జిల్లాలో సెజ్‌ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించి వలసలు నివారిస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌ సిక్స్‌ పథకాలను అమలు చేసే పూచీ నాది. - ఎన్నికలకు ముందు జిల్లా పర్యటనలో లోకేష్‌ చేసిన వ్యాఖ్యలివి.

మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలకి రూ.1500చొప్పున ఐదేళ్లలో రూ. 90వేలు ఇస్తాం. చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15వేలు చొప్పున ఇస్తాం. ఏడాదికి మూడు గ్యాస్‌ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. పెట్రోలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తాం. ఉపాధి హామీ పనుల్లో వేతనాలు పెంచుతాం. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం. ఆక్వా సాగుకు యూనిట్‌ విద్యుత్‌ రూ.1.50కు ఇస్తాం. ఉద్యానపంటలు, తుంపర సేద్యాన్ని పునరుద్ధరిస్తాం. రాయితీపై ట్రాక్టర్లు అందజేస్తాం. - జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.



- అధికారంలోకి రాగానే హామీలు అమలు చేస్తామని చెప్పలేదంటూ బొంకిన చినబాబు
- తండ్రీ కొడుకులు ఎన్నికల సమయంలో చేసిన వ్యాఖ్యలు మీడియాలో పెద్ద ఎత్తున ప్రసారం
- సోషల్‌ మీడియాలో ఇప్పటికీ ఉన్న రికార్డెడ్‌ వీడియోలు
- 'ఈనాడు'లో పతాక శీర్షికన ప్రచురితమైన చంద్రబాబు, లోకేష్‌ హామీలు
- ఇప్పుడేమో తానెక్కడ అన్నానో చెప్పండి.. చూపించండని వితండ వాదం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఈ ప్రచార హామీలు అప్పట్లో పెద్ద ఎత్తున అన్ని రకాల మాధ్యమాల్లో ప్రసారమయ్యాయి. ఈనాడులో చంద్రబాబు, లోకేష్‌ ఇచ్చిన హామీలు పతాక శీర్షికలో ప్రచురితమయ్యాయి. ఇప్పుడు అధికారం దక్కాక లోకేష్‌ మాట మార్చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, రొజుకొక డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేసి ప్రజల్ని మభ్య పెట్టడమే కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే చేస్తామని తామెప్పుడు చెప్పామంటూ.. చంద్రబాబు సుపుత్రుడు లోకేష్‌ అడ్డంగా బుకాయిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పక్కన పెడితే కూటమి పాలన 100 రోజులు దాటినా ఇచ్చిన హామీలకు అతీగతీ లేకుండా పోయింది. అధికారంలోకి రాగానే చేస్తామని ఎక్కడా చెప్పలేదంటూనే.. ఆధారాలుంటే చూపించడంటూ గురువారం శ్రీకాకుళం పర్యటన సమయంలో మీడియాతో వితండవాదం చేశారు. ఇచ్చిన హామీలను నేతలు మరిచిపోతారేమో గాని గూగుల్‌, హామీలిచ్చిన సందర్భంలో ప్రసారం చేసిన మీడియా కథనాలను దాచి పెట్టవన్న విషయాన్ని మరిచి బుకాయించడం లోకేష్‌కు, ఆయన తండ్రి చంద్రబాబుకే చెల్లిందని చెప్పాలి. అధికారంలోకి వచ్చాక చేస్తున్న కాలయాపన, డైవర్షన్‌ పాలిటిక్స్‌ చూస్తే ప్రజల్ని వారెంత మోసగిస్తున్నారో అర్థమవుతోంది.

హామీలివ్వడం, ప్రజల్ని మభ్యపెట్టడం, అవసరం తీరాక గాలికొదిలేయడం చంద్రబాబు, లోకేష్‌కు పరిపాటిగా మారింది. చేసిన తప్పు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బుకాయింపునకు దిగుతున్నారు. అబద్ధాలతో తమ పాలనను పూర్తి చేసేద్దామన్న ధోరణితో ఉన్నారు. గురువారం శ్రీకాకుళంలోని ఓ పాఠశాల అకస్మిక తనిఖీ సమయంలో మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తామెక్కడా అధికారంలోకి వచ్చిన వెంటనే చేస్తామని చెప్పలేదంటూ.. ఎదురు దాడికి దిగారు. తాను అలా మాట్లాడానని ఎక్కడైనా చూపించండని వితండ వాదం చేశారు. లోకేషే కాదు ఆయన తండ్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు యూట్యూబ్‌లోనూ, ఫేస్‌బుక్‌ గ్రూపుల్లోనో సెర్చ్‌ చేస్తే లెక్కకు మించి కనిపిస్తాయి. అంతేకాకుండా ఎన్నికల సమయంలో తమ హామీలను మక్కీకి మక్కీ ప్రచురించిన ఈనాడు పేపర్‌ తెరిచి చూసినా కనబడతాయి. అయినప్పటికీ గురువారం లోకేష్‌ బుకాయించడాన్ని చూసి మీడియా ప్రతినిధులు సైతం ఆశ్చర్యపోయారు. అంత దారుణంగా బొంకుతారా? అని విస్తుపోయారు. లోకేష్‌ మాట మార్చినా మీడియా ప్రతినిధులు ఒక అడుగు ముందుకేసి...అధికారంలోకి రాగానే చేస్తామంటూ చేసిన ప్రచార వీడియోలు ఉన్నాయంటూ తిరిగి ప్రశ్నించారు. ఉంటే చూపించడంటూ లోకేష్‌ వితండ వాదానికి దిగడం మీడియా సర్కిల్స్‌లో చర్చనీయాంశమైంది.

లోకేష్‌కు బాధ్యత లేదా?

ఎచ్చెర్ల నియోజకవర్గం పాతర్లపల్లిలో నిర్మాణంలో ఉన్న స్కూల్‌ భవనం స్లైడ్‌ కూలి ఒక విద్యార్థి మృతిచెందగా, మరో విద్యార్థి గాయపడ్డాడు. దీనిపై విద్యాశాఖ మంత్రిగా లోకేష్‌ స్పందించే తీరు ఆక్షేపణీయంగా ఉంది. జరిగిన ఘటనను ఆరా తీయడం తప్ప అంతకుమించి ఏమీ చేయలేదు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళం నగరంలో ఒక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసేందుకు వచ్చారు. రణస్థలం మీదుగానే శ్రీకాకుళం వచ్చారు. అకస్మిక తనిఖీ తర్వాత రణస్థలం మీదుగా వెళ్లడమే కాకుండా అక్కడ కాసేపు ఆగి కూటమి శ్రేణులకు అభివాదం చేశారు. కానీ, పాఠశాల ప్రమాదంలో మృతి చెందిన, గాయాలకు గురైన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించాలన్న ఆలోచన చేయలేదు. అమరావతి నుంచి ప్రత్యేకంగా రావాలనుకుంటే కాస్త ఆలోచించొచ్చు. శ్రీకాకుళం జిల్లాలోకి వచ్చి, రణస్థలం మీదుగా వెళ్లి కూడా పక్కనే ఉన్న పాతర్లపల్లి బాధిత కుటుంబాలను ఓదార్చడానికి చొరవ చూపలేదు. ఒక పాలకుడిగా, సంబంధిత మంత్రిగా వారి దగ్గరకు వెళ్లి భరోసా కల్పించాల్సిందిపోయి బాధితులవైపు కన్నెత్తి చూడకుండా లోకేష్‌ వెళ్లిపోవడం విమర్శలకు దారితీసింది. కనీసం మానవత్వం లేదా? అని కొందరు దుయ్యబడుతున్నారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యత లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

వచ్చే ఏడాది నుంచి ప్రతి క్లాసుకు ఒక టీచర్‌

- మున్సిపల్‌ ఎలిమెంటరీ స్కూల్‌ను తనిఖీ చేసిన మంత్రి లోకేష్‌



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్‌

శ్రీకాకుళం (పీఎన్‌ కాలనీ): వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి క్లాసుకు ఒక టీచర్‌ విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఎచ్చెర్ల వీధిలోని మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఎలిమెంటరీ స్కూల్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హ్యాండ్‌ రైటింగ్‌ మెరుగుదల కోసం కాపీ రైట్‌ బుక్స్‌ రాయిస్తున్నామని టీచర్లు చెప్పగా, రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో ఇదే విధానాన్ని అమలుచేసే అంశాన్ని పరిశీలిస్తామని లోకేష్‌ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన టీచర్‌గా మారి విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. చిన్నప్పుడు తాను కూడా అల్లరి చేసేవాడినని చెప్పారు. తరగతి గదుల పరిశీలన అనంతరం టీచర్లు, ఎంఈఓ, స్కూలు సిబ్బందితో మంత్రి లోకేష్‌ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులన్నింటినీ ఒకేసారి మార్చడం సాధ్యం కాదని ఆయన చెప్పారు. మంత్రి లోకేష్‌ వెంట ఎమ్మెల్యే గొండు శంకర్‌, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి తదితరులున్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: విభిన్న ప్రతిభావంతుల స్వాభిమాన్‌ ప్రత్యేక గ్రీవెన్స్‌ శుక్రవారం నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వినతుల స్వీకరణ జరుగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తేలని పంచాయితీ

- రెవెన్యూ బదిలీలపై నాయకులు, అధికారుల మధ్య కుదరని సమన్వయం
- ఉమ్మడి జిల్లాల సమస్యతో మరింత జాప్యం



శ్రీకాకుళం పాతబస్టాండ్‌: రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు ప్రహసనంగా మారుతున్నాయి. ప్రభుత్వ పెద్దల జోక్యం మితిమీరుతుండడంతో బదిలీల పంచాయతీ తేలడం లేదు. మార్గదర్శకాలు, స్టేషన్‌ సీనియారిటీ, సిబ్బంది వెసులుబాటును పరిగణనలోకి తీసుకొని బదిలీలు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఏదేమైనా సరే తమ సిఫార్సు లేఖలకు అనుగుణంగా బదిలీలు చేయాలని నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆలస్యం తప్పడం లేదు. దీనికి తోడుగా ఉమ్మడి జిల్లాలో ఉన్న మండలాలకు సంబంధించి బదిలీలకు ఈ కూటమి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడం చిక్కులు తెచ్చి పెడుతోంది. వాస్తవానికి ఈ బదిలీలు ఈ నెల 22వ తేదీ నాటికి పూర్తి కావాలి. కానీ గడువు ముగిసి ఐదు రోజులవుతున్నా రెవెన్యూ శాఖలో ఒక్క కేడర్‌లో కూడా బదిలీలు చేయలేకపోయారు. గడిచిన నాలుగు రోజులుగా బదిలీల జాబితా తయారు చేయడం, దాన్ని సవరించడంతోనే సమయం సరిపోతోంది. దీనికి తోడుగా ఒకే చోటకు ఇద్దరికి సిఫార్సు లేఖలు ఇస్తుండడంతో జాబితాలు మారుతూ వస్తున్నాయి.

సిఫార్సు లేఖలతో చిక్కులు..


బదిలీల్లో రాజకీయ కక్షలకు నాయకులు తెర లేపుతున్నారు. కొంతమంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేయకపోయినా, వారిని మార్చాలని సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం చేయడం కుదరదని అధికారులు చెబితే, పరిపాలన సౌలభ్యం పేరుతో బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. నాయకులకు వాస్తవ పరిస్థితులు చెబుతున్నా వారు పట్టించుకోకపోవడంతో ఈ పంచాయతీ బుధవారం వరకు కొనసాగింది. రాజాం, పాలకొండ నియోజకవర్గాల మండలాల్లో ఇంకా సమస్యలు తీరలేదు. ఆయా మండలాలు విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాలకు వెళ్లాయి. ఇచ్ఛాపురం, కవిటి వంటి శివారు మండలాలకు సిబ్బంది వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. సిబ్బందిని సమన్వయం చేసి, అన్ని మండలాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నం చేస్తుంటే, కూటమి నాయకులు వారి పంతాలు నెగ్గించుకునేందుకే పట్టుపడుతున్నారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకున్నది వీరే..	వీఆర్‌ఓ గ్రేడ్‌-1	వీఆర్‌ఓ గ్రేడ్‌-11	ఆఫీస్‌ సబార్డినేట్స్‌	టైపిస్టులు	కంప్యూటర్‌ ఆపరేటర్లు	సీనియర్‌ అసిస్టెంట్లు	డిప్యూటీ తహసీల్దార్లు	తహసీల్దార్లు
	108	118	02	03	06	32	65	08



శ్రీకాకుళంలో గురువారం కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రైతు బజారు వద్ద ఇదీ పరిస్థితి. - సాక్షి ఫొటోగ్రాఫర్‌, శ్రీకాకుళం

నకిలీలు



- జిల్లా వైద్య శాఖలో ఫేక్‌ జాయినింగ్‌ ఆర్డర్ల మాఫియా
- కీలక స్థానాల్లో ఉన్న అధికారుల హస్తం
- కీలకం కానున్న విచారణాధికారి నివేదిక

అరసవల్లి: జిల్లా వైద్యశాఖలో పలు ఉద్యోగాలకు ఫేక్‌ జాయినింగ్‌ ఆర్డర్లు హల్‌చల్‌ చేస్తున్నాయి. పదుల సంఖ్యలో ఫేక్‌ సర్టిఫికెట్లు పట్టుకుని మోసపోయిన వారు తలలు బాదుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం అన్న ఆశ.. వారిని ఈ ఉచ్చులోకి లాగుతోంది. గత కొన్నేళ్లుగా ఈ ముఠా ఓ కీలక అధికారి ప్రోత్సాహంతో జిల్లా నలుమూలల నుంచి ఆశావహులను గుర్తించి వారి నుంచి రూ.లక్షలు లాగేస్తోంది. గతంలో పనిచేసిన డీఎంహెచ్‌ఓల సంతకాలను ఫోర్జరీలు చేయడం, సూపరింటెండెంట్ల సంతకాలను ఫోర్జరీలు చేసి జాయినింగ్‌ ఆర్డర్లు తయారు చేస్తూ రేటు పెట్టి మరీ అమ్మేస్తున్నారు. దీనిపై జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డేటా ఎంట్రీ పోస్టుకు ఆర్డీ నుంచి ఆర్డర్‌

వైద్య శాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ పోస్టుకు ఏకంగా రీజనల్‌ డైరెక్టర్‌ కార్యాలయం నుంచి జాయినింగ్‌ ఆర్డర్‌ ఇచ్చేలా సృష్టించి అమ్మేస్తున్నారు. నిజానికి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి చేత నియామకాలు జరగాల్సిన ఈ పోస్టులకు విశాఖపట్నం రీజనల్‌ డైరెక్టర్‌ కార్యాలయ సంతకాలతో జాయినింగ్‌ ఆర్డర్లు జారీ అవ్వడంతోనే ఇదంతా ఫేక్‌ అని తేలిపోయింది. వాస్తవానికి స్టాఫ్‌ నర్సులు ఎంపీహెచ్‌ఈలు, సూపరింటెండెంట్లు తదితర జోన్‌ క్యాడర్‌ పోస్టులే ఆర్డీ కార్యాలయం నుంచి నియామకాలు జరుగుతాయి. మిగిలినవి అంటే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు, ల్యాబ్‌ టెక్నీషియన్స్‌, ఎఎన్‌ఎంలు, హెల్త్‌ అసిస్టెంట్లు, జూనియర్‌ అసిస్టెంట్లు, టైపిస్టులు తదితర పోస్టులన్నీ స్థానిక జిల్లా డీఎంహెచ్‌ఓ కంట్రోల్‌ కార్యాలయం నుంచి నియామకాలు జరుగుతాయి. ఆశావహుల బలహీనతే అక్రమార్కుల బలంగా మారిన చందంగా ఇలాంటి ఫేక్‌ ఆర్డర్లు ఇవ్వడం, తీరా పోస్టు రాకపోతే, కోర్టులో కేసు పెండింగ్‌ ఉందని, లేదా కొన్నాళ్ల తర్వాత పోస్టులు తీస్తారని అంతవరకు ఆఫీస్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోవచ్చు అంటూ కబుర్లు చెప్పి మోసం చేస్తూ వస్తున్నారు.

కార్యాలయంలో అధికార సిబ్బందే.. మాఫియాగా

వైద్యారోగ్య శాఖలో ఇంటి దొంగల వల్లే ఈ ముఠా తయారైందనే ఆరోపణ ఎప్పటి నుంచో ఉంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కొందరు ఇలాంటి అక్రమ వ్యవహారాలను కీలక అధికారి ఆదేశాల మేరకు నిర్వర్తిస్తున్నారని తెలుస్తోంది. ఇదే క్రమంలో తాజాగా నగరానికి చెందిన ఓ బాధితురాలికి నకిలీ జాయినింగ్‌ ఆర్డర్‌ ఇచ్చి రూ.లక్షలు నొక్కేశారు. ఇదంతా నకిలీ అని తేలడం ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఈ వ్యవహారం బయటకు రావడం, పోలీసుల కేసు నమోదు, విచారణలు జరగడంతో అక్రమార్కులకు నిద్ర పట్టడం లేదు. పైగా పేరు చెప్పి మరీ రూ.లక్ష చొప్పున ఇచ్చానంటూ ఆమె విచారణాధికారికి వాంగ్మూలం ఇవ్వడం సంచలనమైంది. అలాగే ఎచ్చెర్ల, రణస్థలం, బూర్జ, ఆమదాలవలస, పాలకొండ, పలాస తదితర ప్రాంతాల్లో కూడా బాధితులున్నారని తెలుస్తోంది. శ్రీకాకుళం బాధితురాలి అంశంలో విచారణ అనంతరం తయారు చేసిన నివేదిక ఇప్పుడు కీలకం కానుంది. వాస్తవానికి ఈ నివేదిక ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు చేరినట్లుగా సమాచారం. ఈ వ్యవహారంపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్‌ మీనాక్షి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా తన దృష్టిలో ఫేక్‌ ఆర్డర్లు అంశం ఉందని, కేవలం అర్హత, రిజర్వేషన్ల ప్రకారమే ఉద్యోగాలొస్తాయన్నారు.

క్లుప్తంగా

మెరుగైన ఎక్సైజ్ విధానం లక్ష్యం



అధికారులతో సమీక్షిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన ఎక్సైజ్ విధానం లక్ష్యంగా పనిచేస్తానని నూతన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల సమీపంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతి నాయుడు, సీఐ ఎంవీ గోపాల కృష్ణతో కూడిన అధికారులు ఆయనను కలిశారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్సైజ్ విధానం, అమలు తీరును అడిగి తెలుసున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖను ముందుకు తీసుకువెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రానైట్ బ్లాకులతో ఒరిగిన లారీ



నరసింగపల్లి సమీపంలో ఒరిగిపోయిన లారీ

టెక్కలి: టెక్కలి మండలం నరసింగపల్లి సమీపంలో గురువారం వేకువ జామున గ్రానైట్ బ్లాకులతో వెళ్తున్న లారీ ఒక పక్కకు పంట పొలాల్లోకి ఒరిగిపోయింది. ఆ సమయంలో జనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విజయనగరం జిల్లా ముచ్చెర్ల ప్రాంతానికి చెందిన సూర్యనారాయణ గ్రానైట్ నుంచి మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపంలో డీఎం ఎక్స్‌పోర్ట్స్‌కు రెండు బ్లాకులతో వెళ్తున్న లారీ ఈ ప్రమాదానికి గురైంది. అయితే పర్మిట్‌లో పేర్కొన్న దాని కంటే అధికంగా బరువు ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మట్టా భాస్కరరావు గాయపడ్డారు. చిలకపాలెం సమీపంలో విశాఖపట్నం వైపు వెళుతున్న వ్యాన్‌ని వెనుక నుంచి కంటైనర్ వాహనం ఢీ కొట్టింది. దీంతో కుదుపుకు వ్యాన్ ఆగి ఉన్న హైవే సర్వీస్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

ఆర్టీసీకి అదనపు రాబడి



శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటో డిపో పరిధిలో కార్గో రవాణా విభాగం

- దూసుకుపోతున్న కార్గో ఆదాయం
- గత నాలుగేళ్లుగా విస్తరిస్తున్న సేవలు
- ఈ ఏడాదికి గాను రూ.8.5కోట్ల ఆదాయం లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్:

ఆర్టీసీలో కార్గో సేవలు రోజు రోజుకూ విస్తరిస్తున్నాయి. సరుకు రవాణా పెరుగుతుండడంతో ఆర్టీసీకి అదనపు ఆదాయం వస్తోంది. జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలు, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల పరిధిలో కార్గో ఆదాయం గత ఏడాది కంటే ఎంతో ఎక్కువగా పెరిగింది.

తక్కువ సమయం ఎక్కువ ఆదాయం..

జిల్లాలో లభ్యమయ్యే వ్యవసాయ ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులు, విత్తనాలు, ఎరువులు, పుస్తకాలు, మందులు తదితరవి తక్కువ చార్జీలతో రవాణా చేస్తుండడంతో ఆర్టీసీ కార్గో సేవలు వినియోగదారుల ఆదరణ చూరగొంటున్నాయి. జిల్లాలో కార్గో సేవల ద్వారా ఆర్టీసీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.5కోట్ల 3లక్షల 70వేలు ఆదాయాన్ని సమకూర్చుకుంది. పార్శిళ్లు, కొరియర్ కవర్లు రవాణా చేయడం ద్వారా ఈ ఆదాయాన్ని సముపార్జించింది. జిల్లాలోని నాలుగు డిపోల ద్వారా ప్రతి రోజూ సుమారు 460 పార్శిల్ బుకింగ్స్ ఉంటున్నాయి. పార్శిళ్లను జిల్లాలో అయితే సుమారు 8గంటల్లోనూ, రాష్ట్రంలో అయితే సుమారు 24 గంటల్లో వాటి గమ్యస్థానాలకు చేర్చేలా కార్గో సేవలను అందిస్తున్నారు. దీంతో పాటు ప్రైవేటు రవాణా సంస్థల కంటే ఎక్కువ జవాబుదారీ తనం ఉండడంతో ఆర్టీసీ కార్గో సేవలపై వినియోగదారులు మొగ్గుచూపుతున్నారు. 2022–23 కంటే 2023–24లో కార్గో ఆదాయం సుమారు రూ.56.9 లక్షలు అధికంగా లభించింది. జిల్లాలో ఆర్టీసీకి కార్గో ద్వారా 2021–22లో సుమారు రూ.3,18,80,000 లభించగా, 2022–23లో రూ.4,46,80,000 లభించింది. అలాగే 2023–24 ఏడాదికి గాను రూ.5,03,70,000 లభించగా, 2024–25 ఏడాదికి గాను రూ.8.5 కోట్లు లక్ష్యంగా ఆర్టీసీ అధికారులు నిర్ణయించుకున్నారు.

చార్జీలు ఇలా..

0 నుంచి 10 కిలోలకు రూ.80
11 నుంచి 30 కిలోలకు రూ.150
31 నుంచి 50 కిలోలకు రూ.225
51 నుంచి 100 కిలోలకు రూ.300
100 కిలోల పైబడి ప్రతి కిలోకు రూ.2
పార్శిల్ కవర్‌కు 500 గ్రాముల వరకూ రూ.30
501 గ్రాముల నుంచి వెయ్యి గ్రాముల వరకూ కవరకు రూ.50 (జీఎస్టీ అదనం)



విశేష స్పందన



ఆర్టీసీ కార్గో పార్శిల్ సేవలకు విశేష స్పందన లభిస్తోంది. కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు వివిధ ప్రభుత్వ కార్యాలయ అధికారులతో మాట్లాడుతున్నాం. వ్యాపారులు వారి సరుకులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ట్రాకింగ్ చేసుకునే అవకాశం కల్పించాం. ప్రజలు, వ్యాపారులు ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలి. – దివ్య, కమర్షియల్ ఏటీఎం

పార్శిల్ కౌంటర్‌ను బాగు చేయాలి



జిల్లా కేంద్రమైన ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షం పడిందంటే చాలా లాజిస్టిక్ పార్శిల్ కౌంటర్ బురదమయమవుతోంది. దీన్ని బాగు చేయాలి.

– ఆర్.శ్రీనివాసరావు, కళాసీ

సరుకులు వేగంగా చేర్చుతున్నారు



ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు బాగున్నాయి. జిల్లా వ్యాప్తంగా దుస్తుల సరుకులను బుక్ చేసి పంపిస్తుంటాం. పంపించిన సరకులు వేగంగా చేర్చుతున్నారు. సరకులకు చార్జీలు కూడా తక్కువే.

– టి.రాజేశ్వరరావు, స్థానికుడు

నిరుద్యోగులకు ఉపాధి అవకాశం

కార్గో సేవల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4 డిపోల నుంచి సరకు రవాణా చేయడమే కాకుండా 20 మంది ఏజెంట్లను నియమించి వారికి కార్గో వ్యాపారంలో భాగస్వామ్యం కల్పించారు. ఆసక్తి కలిగిన మరింతమంది నిరుద్యోగులకు ఫ్రాంఛైజీ ఏజెన్సీలు ఇవ్వడానికి కూడా ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ ఏజెన్సీ ద్వారా కేవలం సరుకు బుకింగ్, డెలివరీ సదుపాయాలే కాకుండా ఆర్టీసీ బస్ టికెట్‌ల అడ్వాన్స్ బుకింగ్ చేసే అవకాశం కూడా కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలో అయితే రూ.10వేలు డిపాజిట్‌గాను, మిగిలిన ప్రాంతాల్లో అయితే రూ.1000 డిపాజిట్‌గా చెల్లించి ఏజెన్సీ పొందవచ్చని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఏజెంట్‌కు ప్రస్తుతం ఇస్తున్న 10శాతం కమిషన్‌ను 15శాతానికి పెంచడం జరిగింది. ఫ్రాంఛైజీ కావాల్సిన వారు ఆయా ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించవచ్చునని చెబుతున్నారు.

ఆదిత్యునిపై సుప్రభాత సేవ కంపోజ్ చేస్తా

- ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్



మాధవపెద్ది సురేష్ కుటుంబంతో ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: అరవసల్లి సూర్యనారాయణ స్వామికి ప్రత్యేకంగా సుప్రభాత సేవను స్వర కల్పన చేస్తానని ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ అన్నారు. ఆయన ఆదివారం కుటుంబ సమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 72 సినిమాలకు సంగీత దర్శకత్వాన్ని అందించానని, భైరవద్వీపంలో 'శ్రీతుంబుర నారద గానామృతం..' పాట ఎంతగానో గుర్తింపు తెచ్చిందన్నారు. అలాగే శ్రీరామతీర్థాలు పుణ్యక్షేత్రంలో ఈనెల 27న శ్రీరామతీర్థ రఘుపుంగవ సుప్రభాతం ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్నామని, ఇలాగే ఇంతవరకు కాణిపాకం, విజయవాడ కనకదుర్గ అమ్మవార్లకు కూడా సుప్రభాత సేవ చేశానని, అలాగే అరసవల్లితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాల విశిష్టతపై స్వరకల్పన చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఇక సినిమాల్లో తన మనుమడు శ్యామ్‌కల్యాన్ హీరోగా 'నిమ్మకూరు మాస్టార్' సినిమా రానుందన్నారు. అంతకు ముందు ఈయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం, ప్రత్యేక పూజలు చేయించారు.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



ఆస్పత్రిలో వంద్రాడ రాజు మృతదేహం

పాతపట్నం: మండలంలోని బగంతర గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వంద్రాడ రాజు (32) విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బగంతర గ్రామానికి చెందిన వంద్రాడ రాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పాతపట్నంలో పనిచేస్తున్నాడు. ఎప్పటి లాగా బుధవారం ఉదయం కూడా ట్రాక్టర్ డ్రైవింగ్ చేసుకుంటూ రాత్రి ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి పెరటికి మూత్రవిసర్జన కోసం వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా ఇంటికి, వంటపాకకు మధ్యలో ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్ కొట్టింది. భార్య రజనీ, తండ్రి పోలయ్యలు చూసి, వెంటనే వంటపాకవైపు వెళ్లి విద్యుత్ లైన్ స్విచ్ ఆఫ్ చేసి రాజును పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు, వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. మృతుడి భార్య రజని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామని ఏఎస్‌ఐ తెలిపారు.

పట్ట పగలే ఇసుక తరలింపు



గుండవల్లిపేట వద్ద ఎన్‌హెచ్ సర్వీసు రోడ్డులో ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్

నరసన్నపేట: మండలం గోపాలపెంట, బుచ్చిపేటలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పట్ట పగలే ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నాయి. పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అసలు పట్టించుకోవడం లేదు. దీంతో కూటమి పార్టీలకు చెందిన కార్యకర్తలు ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. బుచ్చిపేటలో దొంగతనంగా తవ్వకాలు చేస్తుండగా గోపాలపెంటలో మాత్రం పగలే తవ్వకాలు చేస్తూ ఇసుకను తరలిస్తున్నారు. ప్రశ్నిస్తే దిబ్బ ఇసుక అంటున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.4 వేల నుంచి రూ.5 వరకూ విక్రయిస్తున్నారు. వీఆర్వోలు రాత్రి పహారా ఉంటున్నా కూటమి కార్యకర్తలు వారి కళ్లు కప్పి తవ్వకాలు చేస్తూ విక్రయాలు చేస్తున్నారు.

సొంత నిధులతో విశ్రాంత భవన నిర్మాణం



భవనం ప్రారంభిస్తున్న సర్పంచ్ ముద్దాడ శంకర్

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామ సర్పంచ్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముద్దాడ శంకర్ రూ.1.50 లక్షలు సొంత నిధులతో విశ్రాంత భవనం నిర్మించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆటో స్టాండ్ వద్ద నిర్మించిన భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ భవనానికి అసిరి పోలమ్మ విశ్రాంత భవనంగా నామకరణం చేశారు. స్థానిక ప్రజలు, ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు తన సొంత నిధులతో ఈ భవనం నిర్మించినట్లు సర్పంచ్ చెప్పారు.

15 దేశాలు.. 160 పరిశోధన పత్రాలు



సెంచూరియన్ వర్సిటీలో వికసిత్ భారత్ వాటి లక్ష్యాలు, అబ్‌స్ట్రాక్ట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గురువారం వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వనరుల నిర్వాహణపై అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బినోద్ ఆత్రేయ (నేపాల్), ఓఆర్ఎస్ఐ. (భువనేశ్వర్) డాక్టర్ రబినా రాయణ సుబుద్ధి, ప్రొఫెసర్ మోనీ మడస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ అంశాలపై దేశ విదేశాలకు చెందిన నిష్ణాతులు కూలంకషంగా మాట్లాడారు. రెండురోజుల ఈ సదస్సుకు సెంచూరియన్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సుప్రియా పట్నాయిక్ అధ్యక్షత వహించారు. సదస్సులో 15 దేశాల నుంచి 160 పరిశోధన పేపర్లు అందినట్లు డాక్టర్ రబినారాయణ సుబుద్ధి తెలిపారు. సదస్సులో ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

తిరుపతికి పలాస జీడిపప్పు



వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు అందించే వెంకటేశ్వరస్వామి పవిత్ర ప్రసాదం లడ్డూలోకి పలాస జీడిపప్పు చేరుతుంది. ఇటీవల నూతన టెండర్‌లలో సబ్ కాంట్రాక్ట్‌లో భాగంగా పలాస ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఓ ప్రైవేటు పరిశ్రమకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా గురువారం తొలి జీడిపప్పు వాహనం బయలుదేరి వెళ్లడంతో భక్తులు, పరిసర ప్రాంత ప్రజల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరలించారు. వాహనాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాలు జెండా ఊపి ప్రారంభించారు.

పొలం మధ్యలో రోడ్డు

- పారశిల్లిలో అధికార నేతల కక్ష సాధింపు



పొలాల్లో వేసిన రోడ్డు

నరసన్నపేట: మండలంలోని పారశిల్లిలో అధికార పక్ష నేతలు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. రోడ్డు పక్కన ఎందరో ప్రభుత్వ బంద స్థలాన్ని ఆక్రమణలు చేస్తే వైఎస్సార్ సీపీ కార్యకర్త మేడి కృష్ణ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆయన వేసుకొన్న రేకు షెడ్‌ను తొలగించారు. అలాగే ఇటీవల మేడి కృష్ణతో పాటు తమ్మిన తిరుమలరావు, పూతి రాము పొలాల్లో రోడ్డును దౌర్జన్యంగా వేశారు. వరి పంట కోతలు అయ్యాక రోడ్డు వేసుకోమని విజ్ఞప్తి చేసినా వినలేదు. పచ్చని పొలాల మధ్య రోడ్డు వేశారు. పూర్వం ఈ మార్గంలో రోడ్డు ఉండేదని సర్వేయరుతో కొలతలు వేయించి మరీ పొలాన్ని తవ్వి దారి తీశారు. ఒక్కొక్కరికీ 30 సెంట్లు భూమి ఉంటే మధ్యలో 15 అడుగుల రోడ్డు వేయించారు. అలాగే మేడి కృష్ణపై అక్రమ కేసులు పెడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇలా అయితే గ్రామంలో ఉండలేమని తిరుమలరావు, మేడి కృష్ణలు వాపోతున్నారు. పొలాలకు వెళ్లేందుకు వేరే దారి ఉన్నా కేవలం పంతం నెగ్గించుకోవడానికే ఈ దారి వేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య తిరుమలరావు, మేడి కృష్ణలను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు తదితరులు ఉన్నారు.

అక్టోబర్ 6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) ఆవిర్భవించి 80 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విజయనగరంలో అక్టోబర్ 6 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోం వేదికగా గురువారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను హృదయరాజుతోపాటు ఆ సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం హృదయరాజు మాట్లాడుతు ఏపీటీఎఫ్ 80 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఓక్ జూబ్లీ వేడుకలతోపాటు 20వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయనగరంలోని ఫూల్‌బాగ్‌రోడ్‌లోని జె-కన్వెన్షన్ మార్చు బాలకృష్ణ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ మహాసభల్లో రాష్ట్ర మంత్రులు, విద్యావేత్తలు, ఉన్నతాధికారులు, మేధావులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎ.సదాశివరాజు, సహాధ్యక్షులు చింతాడ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ



వెంకటేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కవిటి: రాష్ట్ర ప్రజల్ని కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన పాలకులకు మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఎమ్మెల్సీ నర్తు రామారావు వెంకటేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని కొత్తపుట్టుగలోని అభయాంజనేయ స్వామి సన్నిధిలో మాజీ ఎంపీపీ నర్తు చామంతి, యువనేత నర్తు శివాజీతో కలిసి ఆయన గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సురక్షితం ప్రదేశం కాదనే సంగతిని ఇటీవల వచ్చిన వరదలు జనాలతో పాటు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు కూడా తేటతెల్లం చేశాయని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం పావులు కదుపుతుంటే.. ప్రభుత్వం వాటిని దాచి పెట్టి దేవుడిపై రాజకీయం చేస్తోందని విమర్శించారు.

'గో'వేదన

- బలద, సీతంపేట సంతల నుంచి రోడ్డు మార్గాన నారాయణవలసకు తరలింపు
- నారాయణవలస సంత నుంచి కబేళాలకు..
- రాణ, లింగాలువలస వద్ద మందలుగా బస
- తరిగిపోతున్న గోసంపద



రాణ-నారాయణవలస గ్రామాల మధ్య తోటలో రవాణాకు సిద్ధంగా ఉన్న పశువులు

జలుమూరు: జిల్లాలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంత నుంచి కబేళాలకు ఈ పశువుల తరలింపు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. రోడ్డు మార్గాన తెచ్చిన ఈ పశువులను మందలుగా జలుమూరు మండలం, లింగాలవలస, జోనంకి పంచాయతీ రాణ తోటల్లో ఉంచుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సంత పాట వేలం పాడిన వారితోపాటు పశువులు కబేళాలకు తరలించే మరి కొంత మంది ఈ బృందంగా తోడై నారాయణవలస సంతనే అడ్డాగా మార్చుకున్నారు. పశువులు కాపలా కాసే వారికి భోజన, వసతి సదుపాయాలు, అలాగే పశువులకు కావాల్సిన దాణా, గడ్డి, తాగు నీరు తదితర ఏర్పాటుకు కూలీలను సైతం పెట్టారు. బలద, సీతంపేట నుంచి రోడ్డు మార్గాన పాతపట్నం మీదుగా సారవకోట మండలం నుంచి జలుమూరు మండలం రాణ, లింగాలవలస గ్రామాల వద్దకు పశువులను తీసుకెళ్లి తోటల్లో ఉంచుతున్నారు. వాహనాలు సిద్ధం చేసుకుని సంత వద్దకు తెచ్చి సాయంత్రం పశువులను ఆ వాహనాల్లోకి ఎక్కించి రాత్రి పూట హైదరాబాద్, బెంగళూర్, నేపాల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదే చోట భారీగా పశువుల పాకలు ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా కొనుగోలు చేసిన పశువులను ఇక్కడకు లారీలు, వ్యాన్ల ద్వారా తరలించి గురు, శుక్ర శనివారాలతోపాటు ఆదివారాల్లో కబేళాలకు తీసుకెళ్తున్నారు.

లోడింగ్ చేసిన వాహనాల్లో ఉన్న పశువులు అరవకుండా మత్తు ఇంజెక్షన్లు సైతం ఇస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన పోలీసు, పశు సంవర్ధక శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి వారం ఇక్కడ రూ.కోట్లలోనే వ్యాపారం జరుగుతోంది. గురు, శుక్రవారాల్లో దాదాపు పది వరకు లారీల్లో పశువులను తరలిస్తున్నారు. దీనిపై పశుసంవర్ధక శాఖ జేడీ ఎం. జయరాజ్‌ను వివరణ కోరగా పోలీస్, రెవెన్యూ,ఎంపీడీఓల సమన్వయంతో అడ్డుకుంటామన్నారు. జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు మాట్లాడుతూ రోడ్డు మార్గాన తరలించే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. కోటబొమ్మాళి మండలం ఎంపీడీఓ మాట్లాడుతూ అక్రమ రవాణాపై ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగాల భర్తీపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

సారవకోట: ఈ నెల 23న సమగ్ర శిక్ష విడుదల చేసిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీలో గిరిజనులకు అన్యాయం చేశారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు ఢిల్లీలో జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నోటిఫికేషన్‌లో 507 టీచింగ్ పోస్టులకు గాను 10 పోస్టులు మాత్రమే ఎస్టీలకు కేటాయించారని 97 నాన్ టీచింగ్ పోస్టులలో ఒక్క పోస్టు కూడా గిరిజనులకు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. సుమారు 30 పోస్టులు వరకు ఎస్టీలకు కేటాయించాల్సి ఉండగా 10 పోస్టులు కేటాయించడం దారుణమన్నారు. ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న గిరిజనులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.



రిమ్స్‌లో బోధకుల కొరత

- 9 కీలక విభాగాల్లో హెచ్‌ఓడీలు లేని పరిస్థితి
- 11 ప్రొఫెసర్, 12 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ
- 42 ట్యూటర్, 53 ఎస్‌ఆర్ పోస్టులు ఖాళీ



శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల గుర్తింపు ప్రమాదంలో పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బోధన సిబ్బంది పోస్టులు భర్తీ చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. 2007లో రిమ్స్ వైద్య కళాశాలను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 60 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేశారు. ఆ తర్వాత మరో 50 ఎంబీబీఎస్ సీట్లు పెరిగి 100 సీట్లతో కొనసాగుతుండేది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వైద్య రంగం, వైద్య విద్యపైన దృష్టి పెట్టడంతో రిమ్స్‌కు మరిన్ని సదుపాయాలు వచ్చాయి. 13 ఏళ్లగా వైద్యులకు పదోన్నతులు కల్పించకపోవటంతో అప్పటి వరకు ప్రొఫెసర్ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉండేవి. వైద్యులకు పదోన్నతులు కల్పించటంతో ఆ పోస్టులు భర్తీ అవ్వటమే కాకుండా న్యూరాలజీ, యూరాలజీ, ఆంకాలజీ, కార్డియాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలను మంజూరు చేయటంతో పాటు వాటికి ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేశారు. ఈ కారణంగా ఎంబీబీఎస్ సీట్లు 150కి, 19 వరకు ఉన్న పీజీ సీట్లు 64 వరకు 12 విభాగాల్లో ఉన్న పారామెడికల్ కోర్సులు 205 సీట్లు వరకు పెరిగాయి. ఇటీవల కాలంలో పలువురు వైద్యులు పదవీ విరమణ చేయటంతో ఆయా పోస్టులను భర్తీ చేయకపోవటం వల్ల ఖాళీగా ఉండిపోయాయి. రిమ్స్‌లో 11 ప్రొఫెసర్, 12 అసోసియేట్ ప్రొఫెసర్, 16 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 42 ట్యూటర్, 53 ఎస్‌ఆర్ పోస్టులు కూడా భర్తీకి నోచుకోకుండా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు పదోన్నతులు కల్పిస్తే ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ అవుతాయి. ట్యూటర్, ఎస్‌ఆర్ పోస్టులను కూడా ఎంపికలు జరిపి భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయకపోవటం వల్ల ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) దృష్టికి వెళితే రిమ్స్ కళాశాల గుర్తింపు రద్దు చేసే ప్రమాదం ఉంది. ఇలా జరిగితే ఐదేళ్లుగా చదువుతున్న 750 మంది విద్యార్థులు, 200 మంది వరకు ఉన్న పీజీ విద్యార్థులను వేర్వేరు ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. జిల్లా ప్రజా ప్రతినిధులు ఈ విషయంలో జోక్యం చేసుకుని తక్షణం పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఎన్ఎంసీ వచ్చినా ధోకా లేదు

రిమ్స్‌లో ఖాళీలు ఉండటం వాస్తవమే. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు రిమ్స్ తనిఖీలకు వచ్చినా రిమ్స్ గుర్తింపునకు ఇబ్బంది ఉండదు. హెచ్‌ఓడీ లేకపోయినా ఆయా విభాగాల్లో ఉన్న సీనియర్లను హెచ్‌ఓడీలుగా పరిగణిస్తాం. బోధన సిబ్బంది ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఉండాల్సిన కంటే ఎక్కువగానే ఉన్నారు.

– డాక్టర్ వెంకటాచలం, రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్, శ్రీకాకుళం